శిథిలావస్థలో ఎన్నెస్పీ క్వార్టర్స్

- కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారిన వైనం

నూజివీడు: పట్టణంలోని ఎన్నెస్పీ కాలనీలోని క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. ఈ క్వార్టర్స్ కాలం చెల్లి కూలేందుకు సిద్ధంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది కోసం క్వార్టర్స్‌ను 40 ఏళ్ల కిందట నిర్మించారు. ఈ క్వార్టర్స్ వైపు వెళ్లిన వ్యక్తి మెట్లు కూలి గాయపడిన ఘటన ఇటీవల చోటు చేసుకుంది. క్వార్టర్స్ నిరుపయోగంగా ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. విష పురుగులకు నిలయంగా ఉన్నాయి. పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయం పక్కన ఉన్న ఎన్నెస్పీ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరి శ్లాబులు కుంగిపోతున్నాయి. కొన్ని ఫ్లాట్లు అయితే పూర్తిగా కూలిపోయాయి.



శిథిలావస్థకు చేరిన ఎన్నెస్పీ క్వార్టర్స్



కూలేందుకు సిద్ధంగా ఉన్న క్వార్టర్స్

క్వార్టర్స్ కాల పరిమితి 25 సంవత్సరాలే..

నూజివీడు ప్రాంతంలో ఎన్నెస్పీ కాలవలు నిర్మించేందుకు గాను 1977లో సబ్ డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేసి 1980లో సిబ్బందికి ఈ క్వార్టర్స్‌ను నిర్మించారు. దాదాపు ఆరు ఎకరాల స్థలంలో 80 కుటుంబాలు నివసించేందుకు గాను క్వార్టర్స్‌ను 25 సంవత్సరాల కాలపరిమితితో నిర్మించారు. దీంతో వీటి జీవితకాలం 2005లోనే ముగిసినప్పటికి వీటిని అలాగే వదిలేశారు.

శాశ్వత కార్యాలయాల భవనాల నిర్మాణానికి అనుకూలం..

ఆరు ఎకరాల స్థలంలో శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్‌ను తొలగిస్తే ఆ స్థలం ఎన్నెస్పీకి చెందిన అనేక కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మించుకునేందుకు అనువుగా ఉంటుంది. అలాగే వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించినట్లయితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఇప్పటికే కొన్ని భవనాలను కూల్చి ఎన్నెస్పీ ఓఅండ్ఎం డివిజన్ కార్యాలయానికి భవనాన్ని నిర్మించారు. అలాగే ఇక్కడ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహానికి అవసరమైన స్థలాన్ని కేటాయించారు. శిథిలావస్థకు చేరిన భవనాలను ఇప్పటికైనా తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్లుప్తంగా

సిబ్బంది అందుబాటులో ఉండాలి



తిరువూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాల సరఫరాకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. గురువారం తిరువూరు మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆర్బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులు కోరిన విత్తనాలు, ఎరువులను నమోదు చేసుకుని వెంటనే సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్బీకే సిబ్బందికి సూచించారు. కార్యాలయ పనివేళల్లో రైతులకు అందుబాటులో ఉండి వారికి సేవలందించాలని సూచించారు.

రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దు

ఎస్‌ఐ రామకృష్ణ

విస్సన్నపేట: ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా, వాట్సాప్‌లలో రెచ్చగొట్టే సందేశాలు, ఫొటోలు పోస్టు చేయరాదని, అలా ఎవరైనా చేస్తే గ్రూపు అడ్మిన్స్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్‌ఐ జి. రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎగ్జిట్‌పోల్స్ తరువాత సోషల్ మీడియాలో, వాట్సాప్‌లలో ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదన్నారు. ఎవరైనా అటువంటి సందేశాలు, ఫొటోలు పంపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రూప్ అడ్మిన్లు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

మజ్జిగ పంపిణీ



తిరువూరు: తిరువూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి 60 రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్నామని క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కొత్తగుండ్ల ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక జైబావి సెంటర్‌లో మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వేసవి ఎండల తీవ్రత ముగిసే వరకు మజ్జిగ చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ నాళ్లా వెంకట రామారావు, జోనల్ చైర్‌పర్సన్ నాళ్లా సుధాకర్, నాళ్లా కృష్ణారావు, సభ్యులు నాళ్లా సూర్యప్రకాశరావు, గుడిమెట్ల సుబ్బారావు, ముత్యాల నాగేశ్వరరావు, గుర్రం పవన్‌కుమార్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు, సారా స్వాధీనం



నూజివీడు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సిబ్బంది గురువారం దాడులు చేసి 27 మద్యం సీసాలు, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ప్రసాదం అరవింద్ (26) అక్రమంగా నిల్వ ఉంచిన 18 విస్కీ బాటిళ్లు, తొమ్మిది బీరు సీసాలను స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని హనుమంతులగూడెంలో చిల్లిముంతల బాలరాజు (37) వద్ద పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు.

గరికపాటి స్వామిదాసుకు నివాళి



స్వామిదాసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తిరుపతిరావు, నాయకులు

మైలవరం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి మైలవరంలో పార్టీ అభివృద్ధికి గరికపాటి స్వామిదాసు ఎంతగానో కృషి చేశారని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరం గ్రామ సర్పంచ్ గరికపాటి మంజు భార్గవి తండ్రి గరికపాటి స్వామిదాసు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మైలవరంలోని ఆయన నివాసంలో గురువారం కుటుంబ సభ్యులు జ్ఞాపకార్థ కూడిక ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు స్థానిక నాయకులతో కలిసి దివంగత స్వామిదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తిరుపతిరావు మాట్లాడుతూ గరికపాటి స్వామిదాసు పార్టీకి, ప్రజలకు ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇస్తావత్ ప్రసన్నరాణి స్వామి, పొందుగల సర్పంచ్ కోటమ్మ, మాజీ ఎంపీపీ తొమ్మండ్రు హన్నాసుభాషిణి, ఉప సర్పంచ్ చామల సీతారెడ్డి, నిరీక్షణకుమార్, మందా నోవా, మధు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూమికి జీవం



కవులూరులో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్న ఏఓ రాంకుమార్

జి.కొండూరు: పచ్చిరొట్ట ఎరువులను అందించే జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి విత్తనాలను రైతులు తమ మాగాణి భూములలో వినియోగించడం వల్ల భూమి సారవంతంగా మారి అధిక దిగుబడులను సాధించేందుకు వీలు కలుగుతుందని మండల వ్యవసాయాధికారి రాంకుమార్ అన్నారు. మండల పరిధి కవులూరు గ్రామ రైతు భరోసా కేంద్రంలో రాయితీపై ప్రభుత్వం అందించిన పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు ఏఓ రాంకుమార్ గురువారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట ఎరువులను భూమిలో కలియదున్నడం వలన రసాయనిక మందులతో జీవం కోల్పోయిన భూమిలో జీవ కణాలు ఉత్పత్తి అవుతాయని వివరించారు. మండల పరిధిలోని 16 రైతు భరోసా కేంద్రాలలో జీలుగ విత్తనాలు 30 టన్నులు, పిల్లిపెసర విత్తనాలు 10 టన్నులు, జనుము విత్తనాలు ఒక టన్ను అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ రాయితీ పోను జీలుగ 10 కిలోల బ్యాగు రూ.440, పిల్లి పెసర ఎనిమిది కిలోల బ్యాగు రూ.536, జనుము 10 కిలోల బ్యాగుకు రూ.440 రైతు చెల్లించాలని వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న భక్తులు

మైలవరం: మైలవరం వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో చైర్మన్ ఎస్.వీ.సుధాకరరావు, వంశపారంపర్య ధర్మకర్త ఎస్వీ నివృతరావు ఆధ్వర్యంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. మైలవరం పరిసర ప్రాంత మండలాల నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుబంధమైన 30 భజన సమాజాల నుంచి సుమారు 800 మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు వి.బాలాజీ ప్రసాద్, సుధాకరరెడ్డి పర్యవేక్షించారు. భక్తులకు ద్వారకా తిరుమల దేవస్థానాల చైర్మన్ ఎస్వీ సుధాకరరావు భోజనం తదితర సదుపాయాలు ఏర్పాటు చేశారు. పాపయ్య, సుబ్రహ్మణ్యం, దాశరధి, దేవస్థానాల సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల దుకాణం తనిఖీ



జగ్గయ్యపేట: నకిలీ విత్తనాలు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ ఏడీఏ భవానీ హెచ్చరించారు. పట్టణంలోని సాయి వెంకటరమణ విత్తన దుకాణాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులోని విత్తనాలతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో డివిజన్‌లో రైతులు వ్యవసాయపనులు ప్రారంభించారన్నారు. రైతులకు అందుబాటులో విత్తనాలు ఉంచాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. నిర్దేశించిన ధరల కన్నా అధిక ధరకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ

మైలవరం: సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఉదయం మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరుగుతుందని సహాయ రిటర్నింగ్ అధికారి రాజేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే శిక్షణ కార్యక్రమంలో కౌంటింగ్ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

మైలవరం: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం మైలవరం సీఐటీయూ కార్యాలయ ప్రాంగణంలో మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. సీఐటీయూ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో సీఐటీయూ పోరాటాలను వివరించారు. సీఐటీయూ మండల కమిటీ సభ్యులు ప్రత్తిపాటి జ్యోతి, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకురాలు వీరమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.రమణ, విజయ, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

- **ఇబ్రహీంపట్నం:** సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం స్థానిక రింగ్ సెంటర్‌లో గురువారం నిర్వహించారు. మండల కార్యదర్శి ఎం.మహేష్ ఆధ్వర్యంలో కార్మిక జెండా ఎగురవేశారు. నాయకులు ఆలేటి విఠల్‌రావు, వివిధ యూనియన్ల కార్మికులు పాల్గొన్నారు.
- **ఆగిరిపల్లి:** ఆగిరిపల్లిలో స్థానిక కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి రాజులపాటి చంటి, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గుంటూరు జిల్లా మందడం మండలం, మల్కాపురం గ్రామానికి చెందిన గద్దె వెంకటసుబ్బారావు, ఉషారాణి దంపతులు రూ.10,116 వేలు విరాళంగా ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. గంపలగూడెం మండలం నెమలి గ్రామానికి చెందిన దుబ్బాకుల రామకృష్ణ, పుష్పలత దంపతులు రూ.5 వేలు విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

శ్రీరామనామంతో హనుమంతుడి అనుగ్రహం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠంలో దీక్ష విరమణలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 28వ తేదీ నుంచి పీఠంలో హనుమత్ జయంతి, దీక్ష విరమణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం అభయ వీరాంజనేయ స్వామి వారిని పీఠాధిపతి శ్రీ దుర్గాప్రసాద్ స్వామిజీ పంచామృతాలతో అభిషేకాలు, అర్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమాలు నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు భక్తులు దీక్షలను విరమించేందుకు పీఠానికి తరలివచ్చారు. తొలుత దీక్ష పరులను ఉద్దేశించి దుర్గా ప్రసాద్ స్వామిజీ అనుగ్రహ భాషణం చేశారు. అన్ని నామాలలో శ్రీరామ నామం ఎంతో బలమైనదని, శ్రీరామ నామంతో హనుమంతుడి అనుగ్రహాన్ని సైతం పొందవచ్చునని స్వామిజీ భక్తులతో పేర్కొన్నారు. అనంతరం పీఠం ఆవరణలో దుర్గా ప్రసాద్ స్వామిజీ చేతుల మీదుగా పలువురు భక్తులు దీక్షలను విరమించారు. దీక్ష విరమణలకు విచ్చేసిన భక్తులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను దేవస్థానం కల్పించింది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతో పాటు వారు విశ్రాంతి తీసుకునేందుకు సదుపాయాలను కల్పించింది.

క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్యులకు శిక్షణ ఇవ్వడం ఎంతో ఉపయోగకరమని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ ఆధ్వర్యంలో వైద్య కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో డాక్టర్ కంచర్ల సుధాకర్ మాట్లాడుతూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యులు క్యాన్సర్ స్క్రీనింగ్ విషయంలో పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. క్యాన్సర్‌ను గుర్తించి సకాలంలో చికిత్స పొందేలా చేయడం, జీవనశైలిలో చేసుకోవాల్సిన ప్రయోజనకర మార్పులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రివెంటివ్ కేర్ విషయంలో క్షేత్రస్థాయి వైద్యులకు నైపుణ్యాలు పెంపొందించే విషయంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



ఆగిరిపల్లి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని ఈదరలో గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజలకు సూచనలు చేశారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐ సురేంద్ర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి

నూజివీడు: పెద్దలను, వృద్ధులను ఆదరించాలని ఎన్‌సీసీ అధికారులు పేర్కొన్నారు. పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో నిర్వహిస్తున్న 17వ ఆంధ్రా బెటాలియన్ విజయవాడ వార్షిక శిక్షణ కార్యక్రమంలో భాగంగా పలువురు ఎన్‌సీసీ క్యాడెట్లు గురువారం తుక్కులూరులోని జేబీఎల్ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. సుబేదార్ మేజర్ మహేంద్రసింగ్, కెప్టెన్ సీహెచ్ఎస్ఆర్ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో క్యాడెట్లు వృద్ధాశ్రమంలోని వృద్ధులతో గడిపారు. వారి బాగోగులను తెలుసుకున్నారు. కమాండింగ్ ఆఫీసర్ ఎస్. సురేంద్రన్ నేతృత్వంలో భోజనం ఏర్పాటు చేశారు.









చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభం

తిరువూరు: ఎ.కొండూరు మండలం రేపూడిలో సంజయ్ వెంపాటి చారిటబుల్ ట్రస్ట్ శాఖను గురువారం ప్రారంభించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పనే ధ్యేయంగా ఈ ట్రస్ట్ ఏర్పాటు చేశామని నిర్వాహకులు సంజయ్ తెలిపారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, పేద విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేయడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. రమణ మహర్షి ఆశ్రమ నిర్వాహకుడు మణిరత్నం అబ్రహాం, సభ్యులు శీలం సుధీర్‌కుమార్, అభిషేక్ జాన్ సిల్వాన్ లూకా, ఎం. యోహాన్, ఏసురత్నం, కృపాకర్, కుమార్ పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్షలకు 67 మంది గైర్హాజరు

నూజివీడు: పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో గురువారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 58 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 9 మంది మొత్తం 67 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు మొత్తం 499 మందికి గాను 441 మంది పరీక్షకు హాజరయ్యారు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 283 మంది విద్యార్థులకు గాను 247 మంది హాజరుకాగా, 36 మంది గైర్హాజరయ్యారు. శ్రీ శారద జూనియర్ కళాశాలలో 216 మంది విద్యార్థులకు గాను 194 మంది పరీక్షకు హాజరుకాగా 22 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు మడుపల్లి తాతయ్య ప్రభుత్వ కళాశాల పరీక్ష కేంద్రంలో 98 మంది విద్యార్థులకు గాను 89 మంది పరీక్షకు హాజరుకాగా 9 మంది గైర్హాజరయ్యారు.

టెన్త్ పరీక్షలకు 395 మంది గైర్హాజరు

నూజివీడు: డివిజన్‌లో ఐదు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. గురువారం జరిగిన ఎస్ఎస్ పరీక్షకు 500 మంది విద్యార్థులు హాజరుకాగా 395 మంది గైర్హాజరయ్యారని డీవైఈఓ ఎం.సేవియా తెలిపారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో 202 మంది విద్యార్థులకుగాను 100 మంది, జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ కేంద్రంలో 197 మంది విద్యార్థులకు గాను 115 మంది, ముసునూరు హైస్కూల్‌లో 186 మంది విద్యార్థులకు గాను 113 మంది, చాట్రాయి హైస్కూల్ లో 99 మంది విద్యార్థులకుగాను 53 మంది, ఆగిరిపల్లి హైస్కూల్ సెంటర్‌లో 211 మంది విద్యార్థులకుగాను 119 మంది హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాలను సీఎస్‌లు, డీఓలు పర్యవేక్షించారు.

వేంకటాచల స్వామికి సహస్ర దీపాలంకరణ



తిరువూరు: పాత తిరువూరులోని వేంకటాచలస్వామి ఆలయంలో బుధవారం రాత్రి సహస్ర దీపాలంకరణ చేశారు. వైశాఖ మాసంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు స్వామి వారికి సహస్ర నామాలతో అర్చన చేసిన అనంతరం వైష్ణవ గోష్టి సభ్యులు సహస్ర దీపాలంకరణ చేశారు. ప్రతి నెలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అర్చకులు తెలిపారు.

